## విద్యార్థులకు మెనూ ప్రకారం వడ్డించాలి

- డీఈవో రవీందర్



విద్యార్థులతో కలిసి టిఫిన్ చేస్తున్న డీఈవో

దేవరకద్ర, అక్టోబర్ 12 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే సీఎం అల్పాహారాన్ని ప్రతిరోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని డీఈవో రవీందర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో డీఈవో ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం అల్పాహారంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ప్రార్థన చేశారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాత పాఠశాలల్లో ప్రతి రోజు విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సీఎంవో బాలుయాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగేంద్రమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు

- 11 మంది బైండోవర్

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), అక్టోబర్ 12 : గ్రామాల్లో మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కౌకుంట్ల తాసీల్దార్ ఎల్లన్న అన్నారు. గురువారం కౌకుంట్ల మండలంలోని పుట్టపల్లి, పేరూర్ గ్రామాల్లో ఎక్సైజ్ ఎస్సై సుష్మ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న 11 మందిని తాసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో మద్యం విక్రయిస్తే రూ. లక్ష జరిమానాతోపాటు జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు.

### దేవరకద్రలో..

దేవరకద్ర, అక్టోబర్ 12 : సాధారణ ఎన్నికలను పురస్కరించుకొని గ్రామాల్లో బెల్ట్ షాపులు పెట్టి మద్యాన్ని విక్రయిస్తే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ బ్రహ్మంగౌడ్, మహబూబ్‌నగర్ ఎక్సైజ్ ఎస్సై సుష్మ అన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బెల్ట్ షాపులు పెట్టి మద్యం విక్రయిస్తున్న దుకాణదారులను గురువారం మహబూబ్‌నగర్ ఎక్సైజ్ ఎస్సై సుష్మ తాసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

## రైతుల ఎదుగుదలకే సంఘం పని చేస్తుంది

భూత్పూర్, అక్టోబర్ 12 : రైతులు ఆర్థిక ఎదుగుదలకే ఫెడ్ రైతు ఉత్పత్తిదారుల సంఘం పని చేస్తుందని ఆయన సంఘం రాష్ట్ర నోడలాఫీసర్ అభిలాష్‌సాహు అన్నారు. గురువారం మండలంలోని శేరిపల్లిలో రైతులతో సర్పంచ్ శేఖర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు ఎన్నో రకాలుగా కృషి చేస్తున్నాయి. అయినా రైతులు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవడంలో విఫలమవుతున్నారు. ముఖ్యంగా రైతులు పంటలను సాగు చేసేటప్పుడు పొలాన్ని బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, పంటలను వేసిన అనంతరం పరిస్థితులకు అనుగుణంగా ఎరువులను వినియోగించాలని ఆయన తెలిపారు. పంటలు పండిన అనంతరం మార్కెటింగ్‌చేసే విధానాన్ని తెలుసుకోవాలని ఆయన తెలిపారు. ఒక గ్రామంలోని రైతులు ఎక్కువ మొత్తంలో ఏ పంటను సాగుచేశారో తెలుసుకొని ఈ ఫెడ్ రైతు ఉత్పత్తిదారుల సంఘం కొంటుందన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు రామాంజనేయులు, చాంద్‌బాషా, బోర్డుడైరెక్టర్లు వీరస్వామి, స్వప్న, మల్లేశ్, ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

కొత్తకోట, అక్టోబర్ 12 : మండలంలోని అమడబాకుల మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌చారి తెలిపారు. అండర్–19 కబడ్డీ పోటీలకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అనిత, అండర్–17 క్రికెట్ పోటీలకు సాయికృతి ఎంపికైంది. కార్యక్రమంలో నరేశ్‌కుమార్, నాగరాజు, రాఘవేందర్, సరిత పీఈటీ రాధిక పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు పాటించాలి

మదనాపురం, అక్టోబర్ 12 : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని ఎస్సై మురళి గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణాలు చేసేటప్పుడు రూ.50వేలకు మించి డబ్బులు వెంట తీసుకెళ్లరాదని, ఒకవేల ఎక్కువ డబ్బులు తీసుకెళ్లాల్సి వస్తే డబ్బుకు సంబంధించిన రసీదు తప్పనిసరిగా ఉండాలన్నారు.

# గ్రామీణ రోడ్లకు మహర్దశ

- నియోజకవర్గంలోని 8 గ్రామాలకు రూ.18.46కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు



బీటీ రోడ్డుగా మారనున్న నాగన్నపల్లి గ్రామ మట్టిరోడ్డు

దేవరకద్ర, అక్టోబర్ 12 : ఎన్నో ఎండ్ల నుంచి అభివృద్ధికి నోచ్చుకోని గ్రామీణ మట్టి రోడ్లకు మహర్దశ కల్గనుంది. గ్రామాలకు అభివృద్ధితోపాటు గ్రామాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామంలో మట్టి రోడ్లు ఉండడంతో గ్రామ ప్రజలు ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే నరకయాతన పడేవారు. రోడ్లంత గుంతలు, బురద మయంగా ఉండడంతో ఒక గ్రామం నుంచి మరో గ్రామం వెళ్లేందుకు గంటల తరబడి ప్రయాణం చేయాల్సివచ్చేది. వేసవిలో మట్టి రోడ్లపై దుముదూళ్లితో, వానకాలంలో బురదయమంగా ప్రమాదకర గుంతలతో ఉండే మట్టిరోడ్లు బీటీ రోడ్లుగా మారాయి. నియోజకవర్గంలోని వివిధ గ్రామంలో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.18.46 కోట్లు మంజూరయ్యాయి. మండలంలోని బస్వాపూర్, నాగన్నపల్లి గ్రామాల్లో మట్టి రోడ్లకు మహర్దశ నెలకొన్నది. తెలంగాణ ప్రభుత్వ పాలనలో మండలంలోని అన్ని గ్రామాల్లో మట్టి రోడ్లని బీటీ రోడ్లుగా మారడంతో ఆయా గ్రామల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో బస్వాపూర్, నార్లనికుంట గ్రామం నుంచి కోయిల్‌సాగర్ రోడ్డు వరకు 2.87 కిలో మీటరు వరకు రూ. కోటి 60 లక్షలు, చిన్నరాజమూర్–బోలరం నుంచి నాగన్నాపల్లి వరకు 1.70 కిలోమీటర్లకు రూ. కోటి83లక్షలు, మూసాపేట మండలంలోని జాతీయ రహదారి నుంచి తాళ్లగడ్డ వరకు 2.50 కిలో మీటర్ల వరకు రూ.2.50కోట్లు, చిన్నచింత కుంట మండలంలోని పీడ బ్ల్యూ రోడ్డు నుంచి కౌకుంట్ల వరకు 4.65 కిలో మీటర్లకు రూ.3కోట్లు, ముచ్చింతల నుంచి కౌకుంట్ల వరకు 4.50 కిలో మీటర్ల వరకు రూ.3కోట్లు, భూత్పూర్ మండలం హస్నపూర్ గ్రామ బీటీ రోడ్డు 3.50 కిలో మీటర్ల వరకు రూ.3.50కోట్లు, అడ్డాకుల మండలంలో జెడ్పీ రోడ్డు నుంచి దాసర్‌పల్లి వరకు రూ.63లక్షలు, కొత్తకోట మండలంలోని సంకిరెడ్డి గ్రామం నుంచి జాతీయ రహదారి 44 వరకు 2.90 కిలోమీటర్ల వరకు రూ.2.40కోట్ల నిధులు మంజూరు కావడంతో ఆయా గ్రామాల ప్రజలు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



మా గ్రామం నుంచి కోయిల్‌సాగర్ చిన్నరాజమూర్ గ్రామాలకు వెళ్లేందుకు వానకాలం వస్తే చాలా ఇబ్బందులు పడ్డాం. దీంతో గ్రామంలో బీటీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేయించారు. దీంతో గ్రామస్తులందరు ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం.

- కృష్ణారెడ్డి, నాగన్నపల్లి

### అన్ని గ్రామాలనూ అభివృద్ధి చేస్తున్నాం



నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోని ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ ముఖ్య లక్ష్యం. ప్రజలకు అనేక రకాల సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులను అభివృద్ధిలోకి తీసుకోవచ్చేందుకు ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి చేస్తున్న కృషి ఎంతో ఉంది. ఎమ్మెల్యే సహకారంతో మండలంలోని అన్ని గ్రామలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నాం.

- రమాదేవి, ఎంపీపీ దేవరకద్ర

# పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు



దేవరకద్ర : డోకూర్ గ్రామ సమీపంలోని హైస్కూల్‌లో బతుకమ్మ ఉత్సవాలు జరుపుకొంటున్న విద్యార్థినులు

మూసాపేట, అక్టోబర్ 12 : ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు ముగిసి దసరా నవరాత్రి ఉత్సవాల సెలవులు రావడంతో విద్యార్థులు బతుకమ్మలతో ఆడి పాడారు. మండల కేంద్రంతోపాటు నిజాలాపూర్, పోల్కంపల్లి, జానంపేట, వేముల, నందిపేట, దాసరిపల్లి, కొమిరెడ్డిపల్లి, అచ్చాయిపల్లి, తుంకినీపూర్, సంకలమద్ది, చక్రాపూర్ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రత్యేకించి బతుకమ్మలను తయారు చేసుకొని పాఠశాలలకు వచ్చారు. పాఠశాలల ఆవరణలో బతుకమ్మలకు పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అడ్డాకులలో..

మూసాపేట(అడ్డాకుల), అక్టోబర్ 12 : మండల కేంద్రంతోపాటు, పొన్నకల్, కందూరు, శాఖాపూర్, కాటవరం, రాచాల, పెద్దమునగల్‌చేడ్, బలీదుపల్లి, చిన్నమునగల్‌చేడ్ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం విద్యార్థులు బతుకమ్మకు పూజలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో బతుకమ్మలను ఉంచి విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ బొడ్డెమ్మలు వేశారు. అనంతరం బతుకమ్మలను గంగాదేవికి సమర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

### దేవరకద్రలో..

దేవరకద్ర, అక్టోబర్ 12 : మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో దసర ఉత్సవాలను పురస్కరించుకొని పాఠశాలల్లో విద్యార్థులు గురువారం ఘనంగా బతుకమ్మ సంబురాలను నిర్వహించుకున్నారు. మండలంలోని డోకూర్ గ్రామ సమీపంలోని తపోవన్ హైస్కూల్‌లో బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు రంగురంగుల పూల మొక్కలను పేర్చి బతుకమ్మను మధ్యలో ఉంచి బొడెమ్మలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పావని, అనురాధ, స్వప్న, కల్యాణి, సబిహా, మాధురి, దీప్తి, అనిత, ఉమ, శిరీష, చంద్రయ్య, రామకృష్ణ, నర్సింహులు, నాగరాజు పాల్గొన్నారు.

### కొత్తకోటలో..

కొత్తకోట, అక్టోబర్ 12 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు బతుకమ్మను పేర్చి ఆట పాటలు బొడ్డెమ్మలతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయురాలు నిర్మల, కవిత, శోభరాణి, మాధవి, వసంత, వీరమణి, పద్మ, పుష్ప, విజయ, మునీంద్రమ్మ, రఘురాం, ప్రభావతి పాల్గొన్నారు.



మూసాపేట : పోల్కంపల్లిలో..



కొత్తకోట : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు